సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం। 20। మే। 2024



వైభవంగా చందనోత్సవం

పద్మనాభం కుంతీ మాధవ స్వామి ఆలయంలో చందనోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం దేవతామూర్తులను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



తీరం.. జనసంద్రం

విశాఖ: నగరంలోని సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి తీరప్రాంతాలు ఆదివారం జనంతో కిటకిటలాడాయి.



భలేభలే.. బ్రహ్మకమలాలు

పాత పాడేరులోని ఉపాధ్యాయుడు బొంజుబాబు ఇంటి పెరట్లో సుమారు పది బ్రహ్మకమలాలు ఆదివారం రాత్రి వికసించాయి. వీటిని పరిసర ప్రాంతీయులు ఆసక్తిగా తిలకించారు. సోమవారం ఉదయం ఈ పుష్పాలతో శివాలయంలో అర్చన నిర్వహిస్తామని ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ మొక్కను గతేడాది విశాఖలోని స్నేహితుడి ఇంటి నుంచి తీసుకువచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

తిరుమలేశునికి కలువలతో అలంకరణ



కలువ పూల అలంకరణలో బాలాజీ

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీకి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సామూహిక గీతా పారాయణ చేశారు. శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుని కలువ పూలతో అలంకరించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

మోదకొండమ్మ పండగకు చాటింపు



మాడుగుల మోదకొండమ్మ ఆలయం వద్ద చాటింపు వేస్తున్న కార్మికులు

మాడుగుల (అనకాపల్లి): వచ్చే నెల 18న జరగనున్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగకు ఆదివారం చాటింపు వేయించారు. ఈ నెల 21న అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను మహారాజుల కోట ఆవరణలో ఉన్న సతకం పట్టు వద్దకు ఊరేగింపుగా తీసుకువస్తారు. నెల రోజుల పాటు అమ్మవారు అక్కడే కొలువు దీరి భక్తులకు దర్శనమిస్తారు. పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు.

21 నుంచి ఐఐపీఈలో సదస్సు

ఏయూక్యాంపస్ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ, స్టోనీ బ్రూక్స్ యూనివర్సిటీ(న్యూయార్క్)తో సంయుక్తంగా ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు హైడ్రోజన్, గ్లోబల్ డీకార్బనైజేషన్ ఇండో–యూఎస్ వర్క్‌షాప్ నిర్వహించనుందని ఐఐపీఈ సంచాలకులు ఆచార్య శాలివాహన ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోబల్ డీకార్బనైజేషన్ ప్రయత్నాలలో కీలకమైన అంశంగా నిలిచే హైడ్రోజన్‌పై చర్చించే వేదికగా ఇంధన రంగంలోని పరిశ్రమల ఎగ్జిక్యూటివ్‌ల కోసం ప్రత్యేకంగా ఫోరం రూపొందించామన్నారు. మూడు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా హైడ్రోజన్‌పై ప్రత్యేక ప్రాధాన్యత కలిస్తూ, కార్బన్ తక్కువగా ఉండే ప్రత్యామ్నాయాలు, వాతావరణ మార్పు, శిలాజ ఇందనాలపై సమగ్ర సెషన్లు ఉంటాయన్నారు. విద్య, పరిశోధన కేంద్రాలు, విధాన రూపకర్తలు, నిపుణులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌టీపీసీ మాజీ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) ఉజ్వల్ కాంతి భట్టాచార్య హాజరవుతారు. విశిష్ట అతిథిగా సింహాద్రి ఎన్‌టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ ఎస్.కె.సిన్హా పాల్గొంటారు. స్టోనీ బ్రూక్ వర్సిటీ ఆచార్యుడు దేవిందర్ మహాజన్ గ్రీన్ హైడ్రోజన్, ఎనర్జీ ట్రాన్సిషన్‌లో సరికొత్త పురోగతిని వివరిస్తారు. ఐఐపీఈ ఆచార్యుడు కృష్ణ శ్రీ హైడ్రోజన్ నిల్వచేయడం, రవాణా అంశాలపై ప్రసంగిస్తారు.

కలిసొచ్చిన రబీ

జిల్లాలో రబీ దిగుబడులు పెరిగే అవకాశం ఉన్నందున గిరి రైతుల్లో ఆనందం నెలకొంది. నారుమళ్ల దశ నుంచి నాట్లు వేసే వరకు ఏదో ఒక సమయంలో కురిసిన వర్షాలు ఎంతో ఉపయోగపడ్డాయని వ్యవసాయశాఖ తెలిపింది.

- అనుకూలించిన వాతావరణం
- విరగ్గాసిన వరి పైరు
- దిగుబడి దశలో పంట
- కోతలకు సిద్ధమవుతున్న గిరి రైతులు



కంకులతో వరి పైరు



పెదబయలు మండలం మంగబందలో కోతకు సిద్ధంగా రబీ వరి పైరు

సాక్షి,పాడేరు : ఈ ఏడాది రబీలో వరి సాగు గిరి రైతులకు కలిసొచ్చింది. ప్రస్తుతం పైరు విరగ్గాసిన కంకులతో కళకళలాడుతోంది. వరి సాగు చేపట్టిన నాటి నుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పాటు ఏప్రిల్, మే నెలల్లో కురిసిన భారీ వర్షాలు పైరుకు ఎంతో మేలు చేశాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా గింజ దశలో కళకళలాడుతోంది. లోతట్టు భూముల్లో పైరు మరింత ఆశాజనకంగా ఉండటంతో గిరి రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలోని 22 మండలాల్లో కూనవరం, చింతూరు, వీఆర్‌పురం, మారేడుమిల్లి మినహా మిగిలిన 18 మండలాల్లో గిరిజన రైతులు రబీలో వరి సాగు చేపట్టారు. లోతట్టు, నీటి నిల్వలు అధికంగా ఉన్న భూముల్లో గిరిజన రైతులు రెండవ పంటగా రబీలో వరిని సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

సొంత విత్తనాలతోనే సాగు

రబీలో గిరిజన రైతులంతా తమ సొంతంగా నిల్వ ఉంచుకున్న సంప్రదాయ విత్తనాలను ఉపయోగించారు. దుక్కి పనులు నుంచి విత్తన శుద్ధి, నారుమడులు తయారీ, వరుస పద్ధతిలో వరినాట్లు వేయడం వంటి పనుల్లో గిరిజన రైతులకు వ్యవసాయ అసిస్టెంట్లంతా అవగాహన కల్పించారు. కొన్ని ప్రాంతాల్లో శ్రీవరి విధానంలో రైతులు సాగు చేపట్టారు.

మండలాల వారీగా..

జిల్లా వ్యాప్తంగా 2361 హెక్టార్ల విస్తీర్ణంలో రబీ వరిపంట నాట్లు పడ్డాయి. ముంచంగిపుట్టులో 158 హెక్టార్లు, పెదబయలులో 216, హుకుంపేటలో 102, డుంబ్రిగుడలో 149, అరకులోయలో 91, అనంతగిరిలో 98, పాడేరులో 175, జి.మాడుగులలో 154, చింతపల్లిలో 51, జీకేవీధిలో 35, కొయ్యూరులో 68, రంపచోడవరంలో 48, ఎటపాకలో హెక్టార్, దేవీపట్నంలో 551, అడ్డతీగల 133, రాజవొమ్మంగి 75, గంగవరంలో 255,వై.రామవరంలో ఒక హెక్టార్‌లో రబీలో వరి సాగు చేపట్టారు. పైరు పక్వానికి రావడంతో పంట కోతలు మొదలు పెట్టారు.

దిగుబడి పెరిగే అవకాశం



రబీలో వరిని పూర్వం నుంచి సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వరికోతలు పూర్తయిన వెంటనే లోతట్టు భూముల్లో దుక్కి పనులు చేపట్టారు. ఆ సమయంలో కురవడంతో నారుమడుల తయారీకి వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. నారు ఏపుగా పెరగడంతో వరినాట్లు సకాలంలో వేయగలిగారు. ఆర్‌బీకేల్లోని వ్యవసాయ అసిస్టెంట్లు గిరిజన రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. గతేడాది కన్నా దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పంట కోత ప్రయోగాలకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

కొండెక్కిన చికెన్ ధర

- కిలో రూ.300కు చేరిక
- ధర మరింత పెరిగే అవకాశం
- వేసవిలో తగ్గిన కోళ్ల పెంపకం



సాక్షి, విశాఖపట్నం : కొన్నాళ్ల నుంచి ఒకింత అందుబాటు ధరలో ఉన్న చికెన్ ఇప్పుడు చిక్కడం లేదు. రెండు నెలల పాటు కిలో చికెన్ రూ.230–260 మధ్య ఉండేది. మూడు వారాల నుంచి స్వల్పంగా పెరుగుతూ తాజాగా రూ.300కు చేరుకుంది. ఈ ఏడాది మార్చి మూడో వారం నుంచే ఎండలు, వడగాడ్పులు తీవ్రంగా ప్రభావం చూపాయి. ఏప్రిల్ నాటికి అవి తీవ్ర రూపం దాల్చాయి. దీంతో ఫారాల్లో పెరుగుతున్న కోళ్లు వడగాడ్పుల ధాటికి పెద్ద సంఖ్యలో చనిపోయాయి. రోజురోజుకూ తీవ్ర వడగాడ్పులు అధికమవుతుండడంతో పౌల్ట్రీ రైతులు కోడి పూర్తిగా ఎదగక పోయినా మార్కెట్‌కు తరలించే వారు. ఫలితంగా చికెన్ రేటు దిగి వచ్చింది. ఇలా కిలో చికెన్ మార్చి ఏప్రిల్ నెలల్లో రూ.230–260కి మించలేదు. మరోవైపు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పౌల్ట్రీ రైతులు ఫారాల్లో కోళ్ల పెంపకాన్ని గణనీయంగా తగ్గించారు. కోళ్లను ఫారాల్లో బ్యాచ్‌ల వారీగా పెంచుతారు. కోడి పిల్ల చికెన్‌కు వీలుగా తయారవ్వాలంటే ఏడు నుంచి తొమ్మిది వారాల సమయం పడుతుంది. ఏప్రిల్‌లోనే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో మే నెలలో మరింతగా విజృంభించి కోళ్ల మృత్యువాత పడతాయన్న భయంతో పౌల్ట్రీ రైతులు బ్యాచ్‌లను కుదించారు. దీంతో ఇప్పుడు కోళ్లకు కొరత ఏర్పడింది. డిమాండ్‌కు తగినన్ని బ్రాయిలర్ కోళ్ల లభ్యత లేకపోవడంతో చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. ఫలితంగా ఈనెల ఆరంభంలో కిలో స్కిన్‌లెస్ బ్రాయిలర్ చికెన్ రూ.260 ఉండగా ఇప్పుడది రూ.300కి ఎగబాకింది. అంటే 20 రోజుల్లో కిలోపై రూ.40 పెరిగిందన్న మాట! ఫారాల్లో కొత్తగా వేసిన బ్యాచ్‌లు అందుబాటులోకి రావాలంటే మరో మూడు నుంచి నాలుగు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. అందువల్ల కనీసం మరో మూడు వారాల పాటు చికెన్ ధర ప్రియంగానే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరకంటే ఇంకాస్త పెరిగే అవకాశాలూ ఉన్నాయని అంటున్నారు. చికెన్ ప్రియులకు ఈ ధర భారంగానే ఉండనుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో రోజుకు మూడు లక్షలు, ఆదివారాల్లో ఆరు లక్షల కిలోల చికెన్ అమ్ముడవుతుందని అంచనా. బ్రాయిలర్ చికెన్ రేటు కొండెక్కి కూర్చున్న నేపథ్యంలో ఆదివారం ఆ ప్రభావం అమ్మకంపై పడిందని సీతమ్మధారలోని ఓ చికెన్ సెంటర్ నిర్వాహకుడు రామునాయుడు 'సాక్షి'కి చెప్పాడు.

గుడ్ల ధరలూ పైపైకే..

చికెన్ ధర ఇప్పటికే కొండెక్కి కూర్చుంటే.. కోడిగుడ్ల ధరలు కూడా పైపైకే ఎగబాకుతున్నాయి. మార్చిలో వంద గుడ్ల రేటు రూ.425 వరకు ఉండగా, ఏప్రిల్‌లో మరింత క్షీణించి రూ.405కి దిగి వచ్చింది. ఫలితంగా డజను గుడ్లు వినియోగదారునికి రూ.50కే లభ్యమయ్యేవి. కానీ ఇప్పుడు విశాఖలో వంద గుడ్ల ధర రూ.550కు చేరుకుంది. దీంతో డజను రిటైల్ మార్కెట్‌లో రూ.72కు పెరిగింది. కాగా ఉత్తరాంధ్రలో గుడ్లు పెట్టే (లేయర్) కోళ్లు 45 లక్షల వరకు వివిధ పౌల్ట్రీ ఫారాల్లో పెరుగుతున్నాయి. ఇవి రోజుకు సగటున 35 లక్షల గుడ్లను ఉత్పత్తి చేస్తున్నాయి. దాదాపు ఈ గుడ్లన్నీ స్థానికంగానే వినియోగమవుతున్నాయి. ఇలా ఇటు చికెన్, అటు కోడి గుడ్ల ధరలు ఎగసి పడుతుండడం నాన్‌వెజ్ ప్రియులకు రుచించడం లేదు.

మోదమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు



మోదమ్మను దర్శించుకునేందుకు ఆలయ మార్గంలో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

- ఇంటి పండగలతో సందడి
- అమ్మవారికి భక్తి శ్రద్ధలతో ఘటాల సమర్పణ

సాక్షి,పాడేరు: గిరిజనుల ఇలవేల్పు,ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి ఉత్సవాల నేపథ్యంలో విగ్రహాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. వెండి, బంగారు ఆభరణాలు, పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. క్యూలైన్‌లో బారులు తీరారు.

అమ్మవారికి ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఇంటి పండగలతో సందడి నెలకొంది. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, ప్రసాదనాయుడు, వెంకటరమణ, శ్రీను తదితరులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.

అనకాపల్లిలో నూకాంబిక ఆలయానికి..

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, పిల్లాపాపలతో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కు చెల్లించుకున్నారు. క్యూ కాంప్లెక్సలన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులుతీరారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వృద్ధులు, గర్భిణుల కోసం ప్రత్యేక దర్శన కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు



అమ్మవారి ఘటాలను ఆలయానికి తీసుకు వస్తున్న భక్తులు

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం



కల్యాణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



అరకులోయ పట్టణంలో స్వామివారి ఊరేగింపు



చోడవరంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాడేరులో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలంనాయుడు

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామివారి ఆలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. నర్సింగరావు (బుజ్జి), బుజ్జి దంపతుల ఇంటివద్ద పెళ్లిమాటల ఘట్టం నిర్వహించారు. ఆలయ అర్చకుడు బాల గణేష్, కొంకోటలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం, శ్రీ మారుతి విద్యాపీఠం ఆగమ పండిట్, అర్చక ఎగ్జామినర్ శ్రీమాన్ రేజేటి శ్రీరామచార్యులు (రాంబాబు) శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణం తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ సమర్థి రఘునాథ్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పలరామ్, కార్యదర్శి అప్పు, కామేష్, ఆలయ కమిటి మాజీ ప్రతినిధులు కాపుగంటి కృష్ణారావు, ఎల్‌బీ వెంకటేశ్వరరావు, కొల్లా రమేష్‌బాబు, దేవభక్తుల వెంకటరావు, చిట్టిబాబు, లకే బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామివారి..

ఎటపాక: చోడవరం తోటపల్లిలో వేంచేసియున్న శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి వారి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక హోమాలు, పూజలు ఆలయ అర్చకులు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామి వారిని కొలువుదీర్చారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. పొరుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సుండ్రుపుట్టులో వీరబ్రహ్మేంద్రస్వామి..

సాక్షి,పాడేరు: సుండ్రుపుట్టులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమ్మ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవాన్ని విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాడేరు మోదకొండమ్మతల్లి ఆలయం తరఫున పట్టు వస్త్రాలను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తదితరులు ఊరేగింపుగా తీసుకువెళ్లి అందజేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో పాడేరు పురవీధుల్లో ఊరేగించారు.

మన్యంలో విస్తారంగా వర్షాలు

అనంతగిరిలో రోడ్డుపైకి వరదనీరు



రోడ్డుపైకి వచ్చిన వరదనీటిలోంచి వాహన రాకపోకలు



పాడేరులో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి పాడేరులో వర్షం కురుస్తూనే ఉంది. ఖరీఫ్‌కు ఎంతో అనుకూలమని రైతులు తెలిపారు. లోతట్టు భూముల్లో వరద నీరు చేరుతోంది. ప్రధాన మత్స్యగెడ్డలో నీటి ప్రవాహం పెరిగింది.

అనంతగిరి: మండల కేంద్రంలో నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లపైకి వరదనీరు వచ్చేసింది. ఉదయం ఎండతీవ్రత.. మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురుస్తుండటంతో మండల ప్రజలకు వేసవి తాపంనుంచి ఉపశమనం పొందుతున్నారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రం గూడెంకొత్తవీధిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఎండ కాసింది. ఆ తరువాత ఉరుములు, మెరుపులతో సుమారు మూడున్నర గంటలపాటు కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఇంటర్ పరీక్ష ఫీజుకు చివరి అవకాశం నేడు

తుమ్మపాల (అనకాపల్లి): ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్, సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు తత్కాల్ (చివరి అవకాశం)లో ఈనెల 20న దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్మీడి యెట్ అధికారి బి.సుజాత ఓప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో రూ.3వేల రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

లైన్‌మన్‌కు తీవ్ర గాయాలు

- వైర్లు సరిచేస్తుండగా విరిగిన స్తంభం
- పైనుంచి కింద పడిపోవడంతో ప్రమాదం
- వెంటనే పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు

పాడేరు : విద్యుత్ స్తంభం వైర్లు సరిచేస్తున్న సమయంలో విరిగి పడటంతో లైన్‌మన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ ఎస్.బొడ్డాపుట్టు గ్రామంలో ఆదివారం లైన్‌మన్ మసాడ హరికృష్ణ విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా ఉన్నట్టుండి స్తంభం విరిగిపడిపోయింది. దీంతో అతను కిందపడిపోవడంతో కాలు, తలభాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన పరిసర ప్రాంతీయులు అతడిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించడంతో వైద్యసేవలు అందిస్తున్నారు. ఇలావుండగా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఇరడాపల్లి పంచాయతీలోని గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని సర్పంచ్ గుల్లేల అశ్వజ కోరారు.



తీవ్రంగా గాయపడిన లైన్‌మన్ హరికృష్ణ



వంజంగి హిల్స్‌లో..



చెరువులవేనంలో..



పాడేరులో..

అందాలు అదరహో ..

మన్యంలో ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. ఆదివారం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు కొత్త అందాలను ఆవిష్కరించాయి. వంజంగి హిల్స్‌లో మంచు సోయగాలు అబ్బురపరిచాయి.లంబసింగి, చెరువులవేనంలో ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేశాయి. పాడేరులో సప్తవర్ణాలతో ఇంద్రధనస్సు అలరించింది. – సాక్షి, పాడేరు, చింతపల్లి రూరల్

రైతులకు మరింత భరోసా

- అటవీ ఉత్పత్తులు భద్రపరిచేందుకు భవనాల నిర్మాణం
- రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా మార్కెటింగ్ సదుపాయం
- రైతులకు ఉద్యానవన శాఖ, డీఆర్‌డీఏ సహకారం
- గిరిజన రైతుల హర్షం



అనంతగిరిలో ఏర్పాటుచేసిన అటవీ ఉత్పత్తులు భద్రపరుచుకునే కలెక్షన్ సెంటర్

అనంతగిరి: గిరిజన రైతులకు అండగా ప్రభుత్వం సేవలందిస్తోంది.. గిరిజనులు అడవులపై ఆధారపడి జీవిస్తుంటారు. అడవుల్లో దొరికే అటవీ ఉత్పత్తులను ప్రధాన వారపు సంతలకు తీసుకొచ్చి విక్రయించి జీవనోపాధి పొందుతుంటారు. కొన్ని సమయాల్లో వారపు సంతలకు అటవీ ఉత్పత్తులను తీసుకొచ్చినప్పుడు గిట్టుబాటు ధర లేకపోవడంతో తిరిగి ఉత్పత్తులను ఇంటికి తీసుకువెళ్లలేక, దళారీ వ్యాపారులు అడిగిన ధరకే ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. ఎంతో శ్రమించి, కష్టపడి ఉత్పత్తులను సేకరించిన గిట్టుబాట ధర పలకకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. దీనిని గమనించిన ప్రభుత్వం.. పాడేరు డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో అటవీ ఉత్పత్తులను భద్రపరచుకునేందుకు కలెక్షన్ సెంటర్ భవనాలను సుమారు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించింది.

రైతు ఉత్పత్తిదారులు సంఘం సేవలు : ప్రతి మండలంలోని రెండు వేల మంది రైతులు ఉత్పత్తిదారులు సంఘంలోని సభ్యులుగా ఉంటారు. ఒక్కో గ్రూపునకు 10 మంది చొప్పున రైతులు ఉంటారు. ఉత్పత్తులను భవనాల్లో ఉంచుకుని, మార్కెటింగ్ చేసుకోవచ్చు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాట ధర లేనపుడు ఆందోళన చెందనవరం లేదు. రైతు ఉత్పత్తిదారులు సంఘం ద్వారా అటవీ ఉత్పత్తులను కలెక్షన్ సెంటర్లలో ఉంచుకుని, గిట్టుబాట ధర వచ్చినప్పుడు విక్రయించవచ్చు. అలాగే రైతు ఉత్పత్తిదారులు సంస్థ నుంచి అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుంది.

పాడేరు డివిజన్ పరిధిలో : అనంతగిరి, అరకలోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, ముంచంగిపుట్టు, పెదబయల్, జి.మాడుగుల, చింతపల్లి, కొయ్యూరు ఈ తొమ్మిది మండలాల్లో అటవీ ఉత్పత్తుల కలెక్షన్ సెంటర్లు నిర్మాణం జరిగాయి. పాడేరు, జీకేవీధిలో స్థల సమస్య కారణంగా అటవీ ఉత్పత్తుల కలెక్షన్ సెంటర్లు నిర్మాణం కాలేదు. కలెక్షన్ సెంటర్ అందుబాటులోకి వస్తుండడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు కారణంగా భవనాలు పూర్తయినప్పటికీ కొన్నిచోట్ల ప్రారంభం కాలేదు.

వైభవంగా చందనోత్సవం

పద్మనాభం: స్థానిక కుంతీ మాధవ స్వామి ఆలయంలో చందనోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 వరకు కుంతీ మాధవ స్వామికి అర్చక స్వాములు చందనంతో అలంకరించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం ఉదయం ఆరు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పించారు. వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలైన మద్ది, కృష్ణాపురం, రెడ్డిపల్లి, విలాస్కాన్‌పాలెం, కురపల్లి నుంచే కాకుండా దూర ప్రాంతాలైన విశాఖపట్నం, విజయనగరం, భీమునిపట్నం నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

ఇన్వెస్టిగేషన్ వదిలి.. ఇంగ్లిష్ కోచింగ్ వైపు

ప్రతిభకు పదునుపెడితే సరికొత్త ప్రపంచాన్ని సృష్టించే యువతరానికుంది. పుస్తకాలతో కుస్తీలు, ర్యాంకులు, ఆపై ఐదంకెల జీతంతో ఉద్యోగం.. ఇదీ యువత ఒకప్పటి ఆలోచన. నూతన ఒరవడిలో దూసుకుపోవాలనే కాంక్ష.. తాము నేర్చుకున్న విద్యని పది మందికి పంచితే.. వారికి కూడా అద్భుత భవిష్యత్తును అందించొచ్చు అనే ఆలోచన కొందర్ని కొత్త దారిలోకి తీసుకెళ్తోంది. యువతరమంటే అంచనా వేసేందుకు కాదు.. అన్వేషించడానికి. నిర్ణయించడానికి కాదు.. అమలు చేయడానికి., స్థిరమైన పనులు చేసేందుకు కాదు.. సాటివారి తలరాతలు మార్చడానికి అన్న మాటల్ని అక్షర సత్యం చేస్తున్నారు ఆ సీబీఐ అధికారి. దర్యాప్తు అధికారిగా లక్షల జీతం ఇస్తున్న ఉద్యోగానికి స్వస్తి చెప్పి కొత్త మార్గం వైపు పయనిస్తున్నారు.



భీమిలిలో విద్యార్థులకు ఇంగ్లిష్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న శివ

- పేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో శిక్షణ
- సీబీఐ సీఐగా పనిచేస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసిన నాగవల్లి శివ
- విశాఖ, ఢిల్లీ బ్రాంచ్‌లలో విధులు నిర్వర్తించిన శివ
- విశాఖలో పేద విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ అకాడమీ ఏర్పాటు
- ఇంగ్లిష్ ఈజీగా నేర్చుకునేలా శివ రచనలు

సాక్షి, విశాఖపట్నం : సమాజంలో యువత రెండు రకాలు. ఏదైనా సమస్యను చూస్తారు.. వదిలేస్తారు. మరికొంతమంది ఆ సమస్యకు పరిష్కారం దొరికేవరకూ అన్వేషిస్తారు. అవసరమైతే మరికొంతమందితో చర్చిస్తారు. విభిన్న ఆలోచనల్ని, పరిష్కార మార్గాల్ని సేకరిస్తారు. ఆ కోవకు చెందిన వారే నాగవల్లి శివ. మారుమూల పల్లెలో పుట్టి కేంద్ర దర్యాప్తు సంస్థలో ఉద్యోగాన్ని సాధించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని గుడ్డిగూడెం గ్రామానికి చెందిన శివ పేదింట్లో పుట్టారు. చిన్నప్పుడు ట్యూషన్లు చెప్పుకుంటూ తల్లిదండ్రుల్ని ఇబ్బంది పెట్టకుండా తన చదువుకు అవసరమైన డబ్బును సమకూర్చుకునేవారు. ఎంఎ ఇంగ్లిష్‌ని డిస్టింక్షన్‌లో పాసైన శివ.. 2012లో డీఎస్సీ రాసి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అనంతరం 2014లో ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గ్రూప్-4లో కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లోనూ, గ్రూప్-3లో ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్‌లో కొలువులు సాధించారు. అయినా ఏదో వెలితి శివని వెంటాడింది.



శివ రచించిన పుస్తకాలు

పాతికేళ్ల ప్రాయంలోనే రచయితగా..

ఓవైపు సామాజిక సేవా కార్యక్రమాలు, మరోవైపు ఉద్యోగాలే టార్గెట్‌గా నిర్దేశించుకున్న శివ పాతికేళ్ల వయసులోనే రచయితగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఇంగ్లిష్ భాషపై తాను సాధించిన పట్టు.. ప్రతి ఒక్కరికీ అందించాలన్న లక్ష్యంతో ఇంగ్లిష్ వ్యాకరణం అనే పేరుతో.. ప్రతి ఒక్క తెలుగు విద్యార్థి సులువుగా గ్రామర్ నేర్చుకునేలా పుస్తకాన్ని 2011లో రాశారు. వెంటనే వెర్బ్స్ అండ్ ఇట్స్ కాంజుగేషన్, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల్ని రచించగా దీన్ని వీజేఎస్ సంస్థ అచ్చేసేందుకు ముందుకొచ్చింది. ఈ పుస్తకాలు 2015లో మద్రాస్‌లోని కన్నెమర సెంట్రల్ లైబ్రరీలో చోటు దక్కించుకుంటూ జాతీయ స్థాయి గుర్తింపు పొందాయి. ఒకే టికెట్‌పై 15 సినిమాల పేరుతో రాసిన పుస్తకం సంచలనంగా మారింది. శివ పుస్తకాలు అమెజాన్‌లోనూ బెస్ట్ సెల్లర్ బుక్స్‌గా చోటు దక్కించుకున్నాయి. శివ రచనలకు జాతీయ స్థాయిలో సత్కారాలు వరించాయి.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో సత్తా..

ఏదైనా నిజాయితీగా పనిచేస్తూ.. దేశానికి సేవ చెయ్యాలన్నదే శివ లక్ష్యం. అందుకే స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) రాయాలని నిర్ణయించుకున్నారు. 2015లో ఎస్ఎస్‌సీ సీబీఐ ఎస్ఐ రాతపరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రం నుంచి ఎంపికైన నలుగురిలో శివ ఒకరిగా నిలిచారు. ఘజియాబాద్‌లోని సీబీఐ అకాడమీలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్న తర్వాత 2017లో సీబీఐ ఎస్ఐగా విధుల్లో చేరారు. వైజాగ్ బ్రాంచ్‌లో ఎస్ఐగా విధుల్లో చేరిన శివ.. అనేక కీలకమైన కేసుల్లో పురోగతి వచ్చేలా ప్రతిభ కనబరిచారు. అందుకే ఐదేళ్లలోనే సీఐగా పదోన్నతి పొందారు. వైజాగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో సీబీఐ బ్రాంచ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు కూడా. పదోన్నతి పొందిన తర్వాత 6 నెలల క్రితం సీబీఐ హెడ్‌క్వార్టర్స్‌కు శివ బదిలీ అయ్యారు. ఇదే సమయంలో శివకు కొత్త ఆలోచన వచ్చింది.



తెలుగు వాళ్లకు ఉద్యోగాలే లక్ష్యంగా..

ఢిల్లీలో విధుల్లో చేరినప్పుడు.. అక్కడ ఉన్న తోటి ఉద్యోగులతో మాట్లాడుతుండగా.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలుగువారు చాలా తక్కువగా ఉన్నారని గ్రహించారు. దీనికి కారణమేంటని శోధిస్తే.. ఇంగ్లిష్ భాష అని తెలుసుకున్న శివ.. ఈ గ్యాప్‌ని తగ్గించి.. తెలుగు వారు ఎందులోనూ తక్కువ కాకూడదని అనుకున్నారు. అందుకే సీబీఐ ఉద్యోగానికి రాజీనామా చేసి నేరుగా విశాఖ చేరుకున్నారు. తక్కువ ఖర్చుతో విద్యార్థులకు ఇంగ్లిష్‌తో పాటు పోటీ పరీక్షలకు తర్ఫీదునిచ్చేందుకు త్రినేత్ర పేరుతో అకాడమీని స్థాపించారు. ఇంగ్లిష్ భాషలో ప్రతి తెలుగు విద్యార్థి ప్రావీణ్యం పొందేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని శివ చెబుతున్నారు. అందుకే లక్షల రూపాయల జీతం ఇచ్చే ఉద్యోగాన్ని వదులుకున్నా తనకేమీ బాధగా లేదని.. భార్య అంజలి కూడా ప్రోత్సహించడం మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందంటున్నారు. విద్య విజ్ఞానాన్ని, ఆలోచన శక్తిని, సృజనాత్మకతను పెంపొందిస్తుందని, అది పది మందికి పంచితే సమాజం మరింత మెరుగవుతుందన్న లక్ష్యంతోనే అకాడమీ స్థాపించానని శివ చెబుతున్నారు. శివ చేసిన ఈ ప్రయోగానికి సీబీఐ అధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.

నేటి నుంచి తెలుగు భాషా శిక్షణ

మునగపాక : మునగపాక పంచాయతీ కార్యాలయం దరి సోమవారం నుంచి తెలుగు భాషపై పట్టు సాధించేందుకు అవసరమయ్యే శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని యువ రచయిత విల్లూరి జగ్గప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగులో రాయడం, చదవడం వంటి అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ ఇస్తామన్నారు. తెలుగు భాష అధ్యయన వేదిక పేరుతో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్షరాలు, ఒత్తులు పలికే విధానం , రాసే విధానం వంటి విషయాలపై శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9182259317 ఫోన్ నంబరును సంప్రదించాలని జగ్గప్పారావు కోరారు.

వెంకన్న ఆలయంలో ఘనంగా లక్ష తులసీ పూజ



రోలుగుంట: స్థానిక కొండపై గల శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం లక్ష తులసీ పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన లక్ష తులసీ పూజలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్య లో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు గ్రామానికి చెందిన మద్దాల కాశీవిశ్వనాథం దంపతులు అన్నవరం దేవస్థానం ప్రసాదాన్ని అందజేశారు. కె.నాయుడుపాలెం, మరివలస, కొవ్వూరు తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు సమకూర్చారు.

జూలో ఆఫ్రికన్ కోతులు



జూలో ఆఫ్రికన్ కోతి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో అరుదైన కోతి జాతులున్నాయి. ఇటీవల శ్రీకాకుళం జిల్లా అటవీ శాఖ అధికారులు వీటిని విశాఖ జూ పార్కుకు అప్పగించారు. అప్పటి నుంచి ఆ కోతులు జూలో సందర్శకులను అలరిస్తున్నాయి. కొందరు ఒడిశా రాష్ట్రం మీదుగా వేరే చోటకు అనధికారికంగా ఆఫ్రికన్ జాతికి చెందిన రెండు కోతులను తరలిస్తుండగా శ్రీకాకుళం జిల్లా అటవీ శాఖ అధికారులకు పట్టుబట్టారు. వీటిని జూకు అప్పగించినట్టు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. వీటిని జూలో కోతుల జోన్‌లో ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లో సందర్శకుల కోసం అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాతి కోతులను 'లోయిస్ట్ మంకీస్' అని పిలుస్తారన్నారు. ఈ జాతి ఆఫ్రికా ఖండం కాంగో ప్రాంతంలో సంచరిస్తాయన్నారు. ఈ జాతి కోతులు మన దేశంలో ఎక్కడా కనిపించవని తెలిపారు. ఇవి అరుదైన జాతికి చెందినవని తెలిపారు. ప్రస్తుతం జూలో ఇవి ఆరోగ్యంగా ఉన్నట్లు క్యూరేటర్ తెలిపారు.

ఐఎన్ఎస్ జలశ్వను సందర్శించిన క్యాడెట్‌లు



ఐఎన్ఎస్ జలశ్వను సందర్శిస్తున్న క్యాడెట్‌లు

సింథియా: భారత నౌకాదళం కార్యకలాపాలు, సముద్ర వారసత్వం, లైఫ్ ఆన్‌బోర్డ్ షిప్‌లపై సమగ్ర అవగాహనే లక్ష్యంగా సుమారు 100 మంది సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్‌లు తూర్పు నావికాదళానికి చెందిన ఐఎన్ఎస్ జలశ్వ ఓడను సందర్శించారు. సందర్శన సమయంలో సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్‌లకు భారతనౌకాదళానికి చెందిన వివిధ డొమైన్‌లపై సమగ్ర వివరణను ఓడ సిబ్బంది అందించారు.

దేశ ప్రయోజనాలను కాపాడటంలోనూ, సముద్ర భద్రతను పోత్రహించడంలోనూ, మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల్లో పాల్గొనడం వంటి నౌకాదళ సిబ్బంది పాత్రపై వివరించారు. అదే విధంగా క్యాడెట్‌లకు నావికుల దినచర్యలు, విధులు, బాధ్యతలతో పాటు పనిలో వారి సంస్కృతి, ఆన్‌బోర్డ్ షిప్‌లలో వారి జీవితం, నేవీలో సేవ చేయడానికి అవసరమైన త్యాగాలు, అంకితభావం గురించి అవగాహన కలిగించారు. యువతకు దేశభక్తిపై జాతీయ గర్వాన్ని అవలంబించే దిశగా సందర్శన ముగిసిందని నేవీ వర్గాలు తెలిపారు.

వైద్యసిబ్బంది శాంతి ర్యాలీ

సాక్షి,పాడేరు: ప్రపంచ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినోత్సవాన్ని ఆదివారం రాత్రి జిల్లా కేంద్రం పాడేరులో ఘనంగా నిర్వహించారు.హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో మృతిచెందిన రోగులకు దీపాలతో నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు,హెచ్ఐవీ/ఎయిడ్స్ రోగులకు అండంగా ఉన్నామని వైద్య ఉద్యోగులు శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్వహించిన ఈ ర్యాలీలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, వైద్యసిబ్బంది

మట్టి పరీక్ష.. పొలానికి రక్ష



తుమ్మపాలలో భూసార పరీక్షకు మట్టి నమూనా సేకరిస్తున్న ఆర్బీకే సిబ్బంది

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- ఎరువులు,పెట్టుబడులు ఆదా
- అధిక దిగుబడులకు ఆస్కారం
- ప్రత్యేకంగా దృష్టి సారించిన వ్యవసాయాశాఖ
- ఈ ఏడాది లక్ష్యం 30,709 మట్టి పరీక్షలు

యలమంచిలి రూరల్: గాలిలో దీపం పెట్టి దేవుడిపై భారం వేసినట్టుగానే చాలా మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు భూమిలో ఉన్నాయో..లేవో తెలుసుకోకుండానే వ్యవసాయం చేస్తున్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారుతోంది. ఈ క్రమంలో ఆశించిన దిగుబడులు రాక నష్టపోతున్నారు. జిల్లాలో ఏటా 1,85,825 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. పంట సాగు చేసేముందు ప్రతి రైతు భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయించుకోవాలి. పంట కోత ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలి. భూసార పరీక్ష వల్ల ఏ పంట పండించాలో తెలుసుకోవచ్చు. రసాయన ఎరువు ఎంత వేయాలో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయడం వల్ల భూమికి ఇటురక్షగా ఉంటుంది. భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు,వాడే క్రిమిసంహారకాలు,ఎరువులను బట్టి మార్పు చెందుతుంది. ఆ మార్పుల్ని ఎప్పటికప్పుడు కనిపెట్టి వ్యవసాయం చేస్తేనే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని వారు చెబుతున్నారు. వాస్తవానికి 90 శాతం మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే సాగు చేస్తున్నారు. దిగుబడుల కోసం రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నా ఖర్చుల భారం తప్ప దిగుబడులు పెరగడం లేదు. అంతేకాకుండా వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.ఈ నేపథ్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయాశాఖ సమయాత్తమైంది. శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి భూసార పరీక్షలు ఎంత అవసరమో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. విత్తనానికి ముందు మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలను బట్టి నేలకు పోషకాలు అందించేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.భూసార పరీక్షల విధానంలో కూడా కొత్త పద్ధతులను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది.మారిన విధానంలో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్)ద్వారా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆర్బీకేల్లో ...

ఎరువుల వినియోగంలో అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లోనే భూసార పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించింది. భూమిలో ఉన్న పోషక పదార్థాలే కాకుండా చౌడు గుణాలు,సున్నపు శాతం ,నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా ఈ పరీక్షలు ఉపయోగపడనున్నాయి

సూక్ష్మ పోషకాలే కీలకం

పంటల సాగులో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం,జింక్,ఇనుము,వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ, స్థూల పోషకాలతో పాటు పీహెచ్,సేంద్రీయ కర్బనాల స్థాయి చాలా కీలకం.సేంద్రీయ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతోంది. భూమిలో సేంద్రీయ కర్బనం .0.5 శాతం నుంచి 0.76శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు.చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.2 శాతం వరకు ఉన్నట్టు గత పరీక్షల నివేదికల ద్వారా అధికారులు గుర్తించారు.పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక,రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు,పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. దీని ద్వారా భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది.ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరో వైపు మట్టి నమూనా సేకరించే విధానం పై వీపీఏలు,ఏవోలకు వ్యవసాయాశాఖ జిల్లా, మండల స్థాయిలో శిక్షణ ఇచ్చింది.మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు తరలించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,రైతులకు తెలియజేయాల్సిన వివరాలపై సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది 30,709 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా జూన్ నెలాఖరుకు 10 వేల నమూనాలను పరీక్షించాలని నిర్ధేశించగా, ఇప్పటి రెండు వేల మట్టి పరీక్షలు పూర్తి చేశారు.



ప్రయోగశాలలో భూసార పరీక్ష చేస్తున్న సిబ్బంది



వీపీఏలకు భూసార పరీక్షలపై శిక్షణనిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులకు అవగహన పెరగాలి



భూసార పరీక్షలపై రైతుల్లో అవగహన పెరగాలి. మట్టి నమూనా పరీక్ష లేకుండా పంట సాగు చేయకూడదు.ప్రస్తుత పరిస్థితుల్లో భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉంది.నేల ఆరోగ్యంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటాం.మట్టి పరీక్షల ఆధారంగానే యాజమాన్యం చేపట్టి పంట దిగుబడులు సాధించాలి.తద్వారా పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది.దీనిపై రైతుల్లో అవగహన పెంచేందుకు కృషి చేస్తున్నాం. భూసార ప్రయోగ కేంద్రంలో మట్టికి సంబంధించి ఉదజని సూచిక, నేల స్వభావం, లవణ సాంద్రత,సేంద్రీయ కర్బనం,లభ్య పోషకాల స్థాయిని లెక్కిస్తారు. ప్రయోగశాల నుంచి ఫలితాలను బట్టి సిఫార్సులను రైతులు తప్పకుండా పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి